## మైదానం కబ్జాపై మంత్రి ఫరూక్ ఫైర్--






విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 23:నంద్యాల నగరంలోని టెక్కే మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానాన్ని ఆక్రమించి నిర్మించిన కాంపౌండ్ గోడపై రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా నిర్మించిన గోడను తక్షణమే కూల్చివేయాలని మున్సిపల్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.విద్యాసంస్థల ఆస్తులను, ముఖ్యంగా విద్యార్థుల ఆట స్థలాలను కబ్జా చేసే వారిపై ఉక్కుపాదం మోపుతామని మంత్రి హెచ్చరించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించే వారికి ఎలాంటి ఉపశమనం ఉండదని, కబ్జాదారులపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ, పాఠశాల మైదానాలు విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి కీలకమని అన్నారు. అలాంటి స్థలాలను వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఆక్రమించడం క్షమించరాని నేరమని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.అధికారులు అలసత్వం వహించకుండా వెంటనే క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టి, పూర్తి నివేదిక సమర్పించాలని మంత్రి ఫరూక్ ఆదేశించారు. నంద్యాల నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలను ఏమాత్రం సహించబోమని మరోసారి స్పష్టం చేశారు.


## మంత్రి ఫరూక్ పాఠశాల తనిఖీ--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 23: నంద్యాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు. నిబంధనల ప్రకారం నాణ్యమైన భోజనం అందించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలలో విద్యా సౌకర్యాలు, తాగునీరు, మరుగుదొడ్ల పరిస్థితిపై వివరాలు తెలుసుకుని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, డీఈవో జనార్ధన్ రెడ్డి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వైభవంగా గంగా పుష్కరోత్సవము

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 23-: వైశాఖ శుద్ధ సప్తమి సందర్భంగా మహానంది క్షేత్రంలోని నందితీర్థంలో గంగా పుష్కరోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ముందుగా రాజగోపుర మండపంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం నిర్వహించి గంగాదేవికి షోడశోపచార పూజలు చేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం లోపలి కోనేరులో పంచామృతాలు, వివిధ చూర్ణాలు, పసుపు, కుంకుమ, గంధం, విభూతి, పన్నీరు, పుష్పాలతో విశేష అభిషేకం చేశారు. తదుపరి అలంకార హారతులు సమర్పించి గంగాదేవితో కలిసి లోకకళ్యాణార్థం సంకల్ప స్నానాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



## పెట్రోలు బంకులపై ఆకస్మిక తనిఖీలు--

**ఇంధన కొరతపై అధికారుల దృష్టి--**

**నిల్వలు, సరఫరాపై కట్టుదిట్టమైన పరిశీలన---**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 23-నంద్యాల పట్టణంలో గురువారం ఇంధన కొరతపై ప్రజల్లో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో నంద్యాల అర్బన్ తాసిల్దార్ శ్రీనివాసులు పలు పెట్రోలు బంకులపై ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఇటీవల పెట్రోలు, డీజిల్ కొరతతో బంకుల వద్ద వాహనాలు బారులు తీరడం, సరఫరా లోపాలపై ఫిర్యాదులు రావడంతో అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. ఈ సందర్భంగా తాసిల్దార్ బంకుల వద్ద ఇంధన నిల్వలు, సరఫరా వివరాలు, స్టాక్ రిజిస్టర్లు, విక్రయ విధానాన్ని పరిశీలించారు. వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా సమర్థంగా సరఫరా నిర్వహించాలని, ఎక్కడైనా అక్రమాలు లేదా నిల్వ దాచిపెట్టడం జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల సమయంలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ శేఖర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వీఆర్వోలు తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ఇంధన సరఫరా సక్రమంగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఇంధన కొరత సమస్యపై వెంటనే పరిష్కారం చూపించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## నంద్యాలలో పోలీసెట్ పరీక్ష ఏర్పాట్లు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 23:2026-27 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరగనుంది. ఈ పరీక్షకు సంబంధించి నంద్యాలలోని ఈ.ఎస్.సి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ కేంద్రంగా ఎంపికైంది. జిల్లా వ్యాప్తంగా 04-04-2026 నుంచి 21-04-2026 వరకు సుమారు 650 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 22-04-2026 నాటికి హాల్ టికెట్లు జారీ చేయడం పూర్తయింది. పరీక్ష నిర్వహణకు సంబంధించి 21-04-2026న జరిగిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులకు అవసరమైన సూచనలు జారీ చేశారు. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, ఆర్టీసీ తదితర శాఖల సమన్వయంతో పరీక్ష కేంద్రాల వద్ద సమగ్ర ఏర్పాట్లు చేపట్టారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా రవాణా, తాగునీరు, భద్రత వంటి సదుపాయాలు కల్పించారు. జిల్లాలో మొత్తం 7,221 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతుండగా, నంద్యాలలో 2,868 మంది, ఆత్మకూరులో 638 మంది, కర్నూలులో 798 మంది, బేతంచెర్లలో 560 మంది, బనగానపల్లెలో 989 మంది, నందికొట్కూరులో 533 మంది, శ్రీశైలం లో 140 మంది పరీక్ష రాయనున్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్‌తో పాటు ఆధార్ కార్డు తీసుకురావాలని అధికారులు సూచించారు. పరీక్ష కేంద్రాలకు కనీసం ఒక గంట ముందుగా చేరుకోవాలని, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దని హెచ్చరించారు. ఈ.ఎస్.సి ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శైలేంద్ర కుమార్ మాట్లాడుతూ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఎటువంటి సమస్యలు ఎదురైతే 9912377723 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.



## ఉత్సవాలతో ముస్తాబైన బ్రహ్మంగారిమఠం

**భక్తుల కోసం చలువ పందిళ్లు**

**విద్యుత్ కాంతులతో కలకలాడుతున్న దేవాలయం**

**మొదలైన ఆరాధన గురు పూజ మహోత్సవములు**

బ్రహ్మంగారిమఠం ,జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధనా గురుపూజోత్సవములతో బ్రహ్మంగారిమఠం పులకిస్తోంది. ఈ ఉత్సవాలు గురువారం నుండి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అదే విధంగా ఆరాధన ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుండే కాకుండా పురుగు రాష్ట్రాలైన కర్ణాటక ,తమిళనాడు ఒరిస్సా తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తాదులు తరలివస్తారు. ముందే ఎండాకాలం ఆపై సూర్య భగవానుని ప్రతాపం తాండవిస్తోంది. దీంతో ఉత్సవాలకు వచ్చే భక్తాదులు సేద తీర్చే అందుకోసం ఆలయ నిర్వహకులు పెద్ద ఎత్తున చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. అలాగే ఉత్సవాలలో ఆలయ ప్రాంగణంతోపాటు గర్భగుడి గాలిగోపురాలు మొదలుకు ప్రాంతాలలో విద్యుత్ కాంతులు వెదచల్లేలా రంగురంగుల విద్యుత్ బల్బులను ఏర్పాటు చేశారు అదేవిధంగా వివిధ రకాలైన దేవతామూర్తుల విగ్రహాలను విద్యుత్తు లాంపులతో ఏర్పాటు చేయడం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి అదేవిధంగా ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తాదులు తరలివస్తారని వారికి కావలసిన క్యూ కాంప్లెక్స్ ఏర్పాటు చేశారు అదేవిధంగా త్రాగునీరు వైద్యం మొదలు అన్ని రకాల సౌకర్యాలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా మటం నిర్వాహకులు ఏర్పాటు చేశారు. అదేవిధంగా భక్తాదుల కోసం నిత్య అన్నదానాన్ని మంచి రుచికరంగా ఏర్పాటు చేసినట్లు మేనేజర్ ఈశ్వర చారి తెలిపారు. ఉత్సవాలలో భాగంగా గురువారం నటాధిపతులు శ్రీశ్రీశ్రీ వెంకటాద్రి స్వాములవారు తన సతీమణితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు గోమాత కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో కలియ తిరుగుతూ భక్తాదులను పలుకరిస్తూ వారి యోగక్షేమాలను తెలుసుకుంటూ వారికి ఆశీర్వచనాలను అందజేశారు. ఆరాధన ఉత్సవాలు ప్రారంభమైన మొదటి రోజునే బ్రహ్మంగారిమఠం కళకళలాడటం విశేషం. రాబోయే రెండు రోజుల్లో ఈ ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులను తరలివస్తారని వారికి అనుగుణంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా మైదుకూరు డిఎస్పి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ యాదవ్ అధ్యక్షతన భీమటం ఎస్ఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసు బలగాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏపీఎస్ఆర్టీసీ వారు కడప జిల్లా నలుమూలల నుండి రా కడప ,రాజంపేట, మైదుకూరు, పులివెందుల ,జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ,బద్వేలు, గిద్దలూరు ,పోరుమామిళ్ల ,తదితర పట్టణాల నుండి పెద్ద ఎత్తున ప్రత్యేక సర్వీసులను భక్తుల కోసం నడుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఆరాధన ఉత్సవాలలో ముఖ్యంగా 26వ తేదీ వైశాఖ శుద్ధ దశమి నాడు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారు సజీవ సమాధిలోనికి ప్రవేశించిన రోజు కనుక ఆ రోజున పెద్ద ఎత్తున భక్తాదులు తరలివస్తారనే ఉద్దేశంతో వాటికి కావలసిన అన్ని రకాల ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. ఉత్సవాలలో నేడు బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలలో భాగంగా రెండవ రోజైన శుక్రవారం ఉదయం ఐదు గంటలకు వీరబ్రహ్మ సుప్రభాతం నామ సంకీర్తన ఎనిమిది గంటలకు అభిషేకం, సహస్రనామార్చన

## ఉప్పర్లపల్లె గ్రామంలో ఘనంగా పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ,దేవర ఉత్సవాలు

తుగ్గలి, తుగ్గలి మండల పరిధిలోని గల ఉప్పర్లపల్లె గ్రామం నందు గ్రామ పెద్దలు,ప్రజల ఆధ్వర్యంలో ఘనంగా పెద్దమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ట, పెద్దమ్మ మరియు సుంకులమ్మ దేవతల దేవర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఈనెల 23 గురువారం నుండి విగ్రహ ప్రతిష్ట పూజలు ప్రారంభమయ్యాయని గ్రామ పెద్దలు తెలియజేసారు. ఈనెల 27వ తేదీ సోమవారం రోజు తెల్లవారుజామున 5:30 నిమిషాల నుండి 5:38 నిమిషాల మధ్య కుంభ లగ్న శుభ పుష్కరాంశం నందు వేద పండితుల మంత్రోచ్ఛరణతో యజ్ఞయాగాలతో శ్రీ పెద్దమ్మ దేవత స్థిర ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలియజేశారు. ఈ ప్రతిష్టా కార్యక్రమానికి గ్రామ ప్రజలు భక్తులు హాజరై ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామ పెద్దలు తెలియజేశారు. అదేవిధంగా 29వ తేదీ బుధవారం రోజున శ్రీ పెద్దమ్మ తల్లి,శ్రీ సుంకులమ్మ తల్లి దేవతల దేవర మహోత్సవం వేడుకలను వైభవంగా గ్రామ ప్రజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

## పెద్ద చెరువు అభివృద్ధి పనులకు శ్రీకారం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 23 :నంద్యాల పట్టణంలోని పెద్ద చెరువును సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి కార్యాచరణ ప్రారంభించారు. గురువారం వాటర్ రిసోర్సెస్ శాఖ అధికారులతో కలిసి చెరువు పరిసరాలను పరిశీలించి కీలక ఆదేశాలు జారీ చేశారు.చెరువు చుట్టూ సుమారు 2.5 కిలోమీటర్ల మేర వాకింగ్ ట్రాక్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సౌకర్యవంతంగా ట్రాక్‌ను అభివృద్ధి చేయాలని తెలిపారు. చెరువు పరిసరాల్లో గ్రీనరీ పెంపొందిస్తూ, పగోడాలు ఏర్పాటు చేసి అందమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.చెరువు కట్ట రక్షణకు ఫెన్సింగ్, బౌండరీ ఏర్పాటు, ట్రెంచ్‌లు తవ్వాలని సూచించారు. వర్షాకాలానికి ముందే సివిల్ పనులు పూర్తి చేసి, అనంతరం విస్తృతంగా మొక్కలు నాటేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.పాలేరు వాగు, చామ కాలువలతో అనుసంధానమై సుమారు 700 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువును అభివృద్ధి చేస్తే, నంద్యాలకు కీలక ఆస్తిగా మారుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ శివ శంకర్ రెడ్డి, కేసీ కెనాల్ డీఈ రవికుమార్, అర్బన్ తాసిల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ ప్రసాద్, సర్వేయర్ సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బతో కూలీ మృతి--

**మద్దయ్య కుటుంబానికి సహాయం చేయాలి--**

**ఉపాధి పనుల్లో సౌకర్యాల లోపంపై బికేయంయు ఆగ్రహం---**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 23-నంద్యాల జిల్లా రుద్రవరం మండలం కోటకొండ గ్రామంలో ఉపాధి పనులకు వెళ్లిన కుమ్మరి పెద్దమద్దయ్య (73) వడదెబ్బకు గురై మృతి చెందడం విషాదానికి దారితీసింది. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికేయంయు) తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మద్దయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో ఉపాధి పనులు కొనసాగుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో కూలీలకు కనీస సౌకర్యాలు అందించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆయన విమర్శించారు. బుధవారం ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయంలో పని చేస్తూ పెద్దమద్దయ్య అకస్మాత్తుగా అస్వస్థతకు గురై వాంతులు చేసుకుని కుప్పకూలిపోయారు. వెంటనే తోటి కూలీలు సమీప ప్రైవేట్ ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ మార్గమధ్యలోనే ఆయన మృతి చెందడం బాధాకరమన్నారు. పని ప్రదేశాల్లో తాగునీరు, చలువ పందిళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి కనీస వసతులు లేకపోవడం వల్లే ఈ ప్రాణనష్టం సంభవించిందని బికేయంయు ఆరోపించింది. ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో కూలీల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన బాధ్యత అధికారులదేనని పేర్కొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మద్దయ్య కుటుంబానికి తక్షణం భారీ ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, అలాగే జిల్లావ్యాప్తంగా ఉపాధి పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకుని కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని బాబా ఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు.



## రామచంద్రారెడ్డి మృతి తీరని లోటు--

**జిల్లా బీజేపీ అధ్యక్షులు అభిరుచి మధు---**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 23: బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి అకాల మరణం పార్టీకి, రైతు లోకానికి తీరని లోటని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. గురువారం ఆయన నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామచంద్రారెడ్డి రైతుల సమస్యల పరిష్కారం కోసం చివరి వరకు కృషి చేసిన నిబద్ధత గల నాయకుడని కొనియాడారు. పార్టీ పట్ల ఆయన క్రమశిక్షణ, అంకితభావం కార్యకర్తలకు ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన మరణం వ్యక్తిగతంగా, పార్టీకి పెద్ద లోటని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టకాలంలో కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**